క్లుప్తంగా

ఎలకుర్రు డ్రెయిన్‌ను శుభ్రం చేసిన రైతులు

ఎలకుర్రు(పామర్రు): గ్రామంలో ఉన్న ఎలకుర్రు డ్రెయిన్‌ను స్థానిక రైతులు బుధవారం శుభ్రం చేశారు. డ్రెయిన్‌లో తూడు, డెక్క తదితరాలు ఉండటం కారణంగా మురుగు దిగువకు ప్రవహించడం లేదు. ఈ నేపథ్యంలో స్థానిక రైతులు అందరూ స్వచ్ఛందంగా డ్రెయిన్‌లోని తూడు, గుర్రపు డెక్క తదితరాలను తొలగించే చర్యలు చేపట్టారు. దీని వలన డ్రెయిన్ పరిధిలో ఉన్న వందలాది పొలాలకు సక్రమంగా సాగునీరు ప్రవహిస్తోందని రైతులు పేర్కొన్నారు.

పాములలంక వంతెనపై నివేదిక కోరిన లోకాయుక్త

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు–పాములలంక మధ్య కృష్ణానది పాయపై 2014లో నిధులు మంజూరైనా వంతెన నిర్మాణం ఇంతవరకు ప్రారంభం కాకపోవటంపై రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లను నివేదిక కోరుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ విషయమై ఈ నెల 7వ తేదీన రాష్ట్ర లోకాయుక్తకు తాను ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కృష్ణానదిపై వంతెన నిర్మాణం కోసం 2014లో 13.50 కోట్లు మంజూరై, శంకుస్థాపన కూడా జరిగిందని, 2022లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రూ.31.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినా, ఇంతవరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. తోట్లవల్లూరు–పాములలంక మధ్య కృష్ణానదిపై వంతెన నిర్మిస్తే లంక గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని లోకాయుక్తకు విజ్ఞప్తి చేసినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలియజేశారు.

మాజీ ఎంపీపీకి నివాళి

పెదపారుపూడి: గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కాజ విజయలక్ష్మి గుండెపోటుతో మృతి చెందటంతో ఆమె భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కైలే మాట్లాడుతూ మంచి వ్యక్తిని కోల్పోవటం చాలా బాధకరమన్నారు. అనంతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మండల ఎంపీపీ గోగం సురేష్, సచివాలయాల మండల కన్వీనర్ జాజుల చిన్నారి, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, ఆల రమేష్ తదితరులు నివాళులర్పించారు.

ముంచెత్తిన వాన

గుడివాడరూరల్: అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. నియోజకవర్గ పరిధిలో ఉన్న కాల్వలు, డ్రెయిన్‌లు పొంగిపొర్లుతున్నాయి. వర్షపు నీటికి పంట పొలాలు ముంపునకు గురి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన డ్రెయిన్‌లు అయిన బుడమేరు, చంద్రయ్య, నెహ్రాల్లీ, మోటూరు, ఆత్కూరు డ్రెయిన్‌లు నీటి ప్రవాహం అధికంగా ఉంది. బుడమేరులో నీటి ప్రవాహం 17అడుగులు చేరడంతో పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. వరద ప్రవాహం పెరగడంతో అధికారులు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. డ్రెయినేజీ, రెవెన్యూశాఖ అధికారులు గ్రామాల్లోనే మకాం వేసి వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలకు సూచనలు చేస్తున్నారు. గుడివాడ నియోజకవర్గంలో మూడు మండలాల్లోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఇప్పటికే వేసిన వరినాట్లు ముంపునకు గురి కావడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో వర్షాల వలన పారిశుద్ధ్యం సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో అంటు వ్యాధులు ప్రబలకుండా, క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందించాలని, బ్లీచింగ్ పిచికారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవోలు ఆదేశాలు జారీ చేశారు.

విడవని వాన..

కైకలూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కైకలూరు నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కైకలూరు మండలంలో 6.56 సెంటీమీటర్లు, కలిదిండి మండలంలో 6.02 సెంటీమీటర్ల వర్షపాతం మంగళవారం నమోదైంది. ప్రధానంగా కైకలూరు పంచాయతీ పరిధిలో బస్టాండ్ సెంటర్, టౌన్ హాలు, రైల్వేస్టేషన్, హైస్కూల్ ఎదుట నేషనల్ హైవే రోడ్డు, వెలంపేటలో ఎక్కువగా వర్షపు నీరు చేరింది. టౌన్‌హాలు ఏకంగా పెద్ద నీటి తటాకంగా మారింది. కైకలూరులో డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో పలు ప్రాంతాల్లో డ్రెయిన్ల నీరు రహదారులపైకి చేరింది. కైకలూరు ఏలూరు రోడ్ నుంచి సంతమార్కెట్ వరకు జాతీయ రహదారిపై వర్షాల కారణంగా భారీ గుంతలు పడ్డాయి.

పొక్లయిన్‌తో వర్షం నీరు దారి మళ్లింపు

మండవల్లి : మండవల్లిలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల వర్షం నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో సర్పంచ్ మెండా రూన్సీ, పొక్లయిన్ మెయిన్ రోడ్డుపై వర్షం నీటిని బుధవారం దారి మళ్లించారు. దీంతో రాకపోకలకు దారి సుగమమైందని గ్రామస్తులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

పామర్రు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీంతో పాటు రుతుపవనాలు కూడా చురుగ్గా ఉండటంతో గత రెండు రోజుల నుంచి వర్షాలు అధికంగా పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పామర్రు మండల పరిధిలోని పలు ప్రాంతాలు బుధవారం జలమయం అయ్యాయి. గ్రామంలోని బాపూజీపేట, అరండాల్‌పేట, కోటిరెడ్డిపేట, స్థానిక తహసీల్దార్ కార్యాలయం, బస్టాండ్ తదితర పల్లపు ప్రాంతాలన్నీ నీటమునిగాయి.

రైతుల ఇబ్బందులు..

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు అన్ని నీటి మయంగా మారటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రైతులు తమపొలాలలో వెద సాగు పద్ధతి ద్వారా వరి పంటను వేశారు. వెద వేసిన తర్వాత కాలంలో వర్షాలు అధికమవ్వడంతో పంట వర్షపు నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

మొవ్వ: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొవ్వ మండలంలోని లోతట్టు ప్రాంతాలు, పొలాలు జలమయం అయ్యాయి.

పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

మండవల్లి: మండలంలోని పుట్లచెరువు యూపీ, ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలిచి విద్యార్థుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా పరిసరాల్లో నిలిచిన నీటితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


తటివర్రులో నీటమునిగిన వరిపొలాలు


నీటితటాకంలా మారిన కైకలూరు టౌన్‌హాలు


కైకలూరు హైస్కూల్ ఎదుటరోడ్డు పైకి చేరిన నీరు


జలమయమైన కూచిపూడి రహదారి


డ్రెయిన్లలో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రూన్సీ


మంటాడ ఇందిరమ్మ కాలనీలో చేరిన నీటిని పరిశీలిస్తున్న ఎంపీటీసీ మేరుగ లక్ష్మి

పైన గండి.. కింద పొలాలు మునక

పసుమర్రు(పామర్రు): వరి పొలాలలో ఉన్న వర్షపు నీటిని తొలగించేందుకు గండి కొట్టడంతో దిగువపొలాల్లోకి వర్షపునీరు చేరిన సంఘటన మండల పరిధి పసుమర్రు గ్రామంలో చోటుచేసుకుంది. అక్కడి బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఎగువ ప్రాంతాలలో ఉన్న 100 ఎకరాల సాగు పొలాల రైతులు తమ పొలాల్లో చేరిన వర్షపు నీటికి బయటకు పంపేందుకు గండి కొట్టడంతో ఆ నీరు అంతా దిగువ ఉన్న తమ 600 ఎకరాల పొలాలలోకి వచ్చి చేరుతున్నాయన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.


గండి కొట్టడంతో దిగువ ప్రాంత పొలాల్లోకి చేరుతున్న వర్షపు నీరు


పామర్రు- దిగమర్రు జాతీయరహదారిలో అండర్‌పాస్ వద్ద నిల్వ ఉన్న వర్షపునీరు

రోడ్లు జలమయం.. పొలాల్లోకి నీరు

పమిడిముక్కల: అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. రోడ్లు జలమయమయ్యాయి. వర్షాలతో పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. నారుమడులు, వెద జల్లిన, నాట్లు వేసిన పొలాల్లో నీరు చేరడంతో ముంపునకు గురయ్యాయి. తాడంకి, కపిలేశ్వరపురం, ఐనంపూడి, ముళ్లపూడి, పమిడిముక్కల, చోరగుడి గ్రామాల్లో పంట పొలాలు ముంపులో ఉన్నాయి. డ్రెయిన్‌లు ఎగదన్ని ఉండటంతో పొలాల్లోని మురుగు దిగువకు పోక అవస్థలు పడుతున్నారు. మండలంలో 6 వేల ఎకరాల్లో పంట ముంపునకు గురైందని ఏవో గణేష్‌రెడ్డి తెలిపారు. మంటాడ– లంకపల్లి, మేడూరు, అగినపర్రు, అగినపర్రు రోడ్లు జలాశయాలను తలపించాయి. రాకపోకలు సాగక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రహదారులు నీటితో నిండిపోయాయి. కపిలేశ్వరపురం– ముత్రాసిపాలెం, మామిళ్లపల్లి– గంద్రపువానిగూడెం, కూడేరు శివారు నమ్మితాలగుంట రోడ్లు బురదమయంగా మారడంతో నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంటాడ ఇందిరమ్మ కాలనీలోకి వర్షపునీరు చేరండంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.


కపిలేశ్వరపురం పరిధిలో వరినాట్లు వేసిన పొలాల్లో నిలిచిన నీరు

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

కైకలూరు: అల్పపీడనం కారణంగా వీచిన బలమైన గాలులకు మంగళ, బుధవారాల్లో కైకలూరు నియోజకవర్గంలో 34 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కైకలూరు మండలంలో 6, కలిదిండి మండలంలో 7, మండవల్లి మండలంలో 1, ముదినేపల్లి మండలంలో అధికంగా 20 స్తంభాలకు నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ లైన్లు 33 కేవీ, 11 కేవీలకు సంబంధించి కైకలూరు మండలం వేమవరప్పాడు, అయోధ్యపట్నం, వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్, తామరకొల్లు, కలిదిండి మండలంలో గొల్లగూడెం, అమరావతి, కోరుకొల్లు, చైతన్యపురం, మండవల్లి మండలంలో పెరికేగూడెం, ముదినేపల్లి మండలంలో పేరూరు, చేవూరు, ముదినేపల్లి, అల్లూరు వంటి ప్రాంతాల్లో స్తంభాలు నేలకొరిగాయి. ఆయా మండలాల విద్యుత్‌శాఖ ఏఈలు రవికుమార్, శ్రీనివాసమూర్తి, రామకృష్ణ, మల్లిఖార్జునరావు సిబ్బంది, యంత్రాల సాయంతో విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు.


చేవూరులో విద్యుత్ స్తంభాలను పునరుద్ధరణ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

చంద్రబాబుకు మతి భ్రమించింది

మంత్రి ఆర్కే రోజా



గుడివాడరూరల్: ప్రతిపక్ష నాయకుడు, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు అల్జీమర్స్ వ్యాధి ముదిరిందని, దీంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. కృష్ణాజిల్లా గుడివాడలో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజా విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు చాలాకాలం తర్వాత విలేకరుల సమావేశాలు పెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు వ్యవసాయం, రైతుల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. రైతులను దగా చేసి వారికి మద్దతు ధర ఇవ్వకుండా బీమా ప్రీమియం చెల్లించకుండా దగా చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలు అన్న సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. రైతుల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబు లేదని విమర్శించారు. అమరావతిలో 50 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద వర్గాలు ఇళ్ల నిర్మించుకునేందుకు స్థలాలు ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అదే అమరావతిలో రైతుల భూములను సింగపూర్ బడా వ్యాపార వేత్తలకు అమ్ముకున్న ఘనత చంద్రబాబుదన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలోనూ అసైన్‌మెంట్ భూములను గుర్తించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన నిరుపేద ప్రజలకు పంపిణీ చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. ముఖ్యంగా లంక భూములపై నిరుపేదలకు హక్కు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

గంజాయి గురించి మీరా మాట్లాడేది?

రాష్ట్రంలో గంజాయి సాగు యథేచ్ఛగా సాగుతోందని చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలో గంజాయి సాగు అడ్డగోలుగా జరిగిన సంగతిని అప్పటి మంత్రులు గంటా శ్రీనివాసరావు, అయ్యన్నపాత్రుడు బహిరంగంగానే చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గంజాయిపై ఉక్కుపాదం మోపారన్నారు. గంజాయి ఎక్కడ సాగు చేస్తే అక్కడే దగ్ధం చేస్తున్న విషయం ప్రజలకు తెలుసునన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ప్రజలు చిత్తుగా ఓడించి 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేయడం ఖాయమని రోజా అన్నారు. సమావేశంలో గుడివాడ, మచిలీపట్నం, పామర్రు, అవనిగడ్డ ఎమ్మెల్యేలు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), పేర్ని వెంకట్రామయ్య(నాని), కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్‌లు పాల్గొన్నారు.

టీడీపీ చర్యలపై వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆగ్రహం

గూడూరు(పెడన): బడుగు బలహీన వర్గాలకు ప్రతినిధిగా రాష్ట్ర కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌పై టీడీపీ నాయకులు అనుచితంగా వ్యవహరించినందుకు గూడూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలం నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు చంద్రబాబు నాయుడు కుటిల వైఖరిని ఖండిస్తూ బుధవారం గూడూరు సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వందల సంఖ్యలో వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిపై చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పర్ణం మహాలక్ష్మయ్యనాయుడు, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే ముసలి చంద్రబాబు అసలు రంగును మంత్రి జోగి రమేష్ బయట పెట్టారన్నారు. కుల, మత, రాజకీయ వర్గాల తారతమ్యం లేకుండా రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి జోగి రమేష్‌కు వస్తున్న ప్రజాదరణ టీడీపీ నాయకులకు మింగుడు పడటం లేదన్నారు. దీనిని ఓర్వలేకే బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా ఉన్న మంత్రి జోగి రమేష్‌పై అక్కసు వెళ్లగక్కుతూ పనికిమాలిన చర్యలకు దిగజారుతున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో కూడా తమ ఓటమి ఖాయమని తెలిసి తీవ్ర ఒత్తిడిలో ఉన్న చంద్రబాబు, టీడీపీ శ్రేణులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి అనేక కుట్రలు పన్నుతున్నారన్నారు. ఇలాంటి దిగజారిన చర్యలకు ఒడిగడితే సహించేది లేదని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగితే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.


గూడూరు సెంటర్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

పటమట(విజయవాడతూర్పు): మంత్రి జోగి రమేష్‌పై జనసేన పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు నిరసనగా విజయవాడ బెంజ్ సర్కిల్లో రాష్ట్ర బీసీ సంఘం స్టేట్ సెక్రటరీ కాగిత అజయ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కాగిత అజయ్ మాట్లాడుతూ మంత్రి జోగి రమేష్‌పై అవాకులు చవాకులు పేలితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు కాబట్టే జోగి రమేష్ విమర్శలు చేశారన్నారు.

క్రైస్తవులపై దాడిని అరికట్టాలి


మాట్లాడుతున్న పాస్టర్ల సంఘ నాయకులు స్పర్జన్‌రాజు

పామర్రు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు కారకులను శిక్షించాలని క్రైస్తవ నాయకుడు పాస్టర్ స్పర్జన్‌రాజు అన్నారు. స్థానిక చల్లపల్లి రోడ్డులోని కల్వరి వర్షిప్ సెంటర్ నందు మండల స్థాయి పాస్టర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పర్జన్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించడం, క్రైస్తవ దేవాలయాలను కూల్చడం, తగల బెట్టడం హేయమైన చర్య అన్నారు. ఈనెల 30వ తేదీన పామర్రులో క్రైస్తవ సంఘాలు, క్రైస్తవ నాయకులు ఐక్యతతో శాంతి యుత ర్యాలీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్దనిర్వహించాలని సమావేశంలో తీర్మానించామని తెలిపారు.

పరారైన ఖైదీకి రెండేళ్ల జైలు

గన్నవరం: సబ్‌జైలుకు తరలిస్తుండగా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌ను నెట్టివేసి పరారైన నిందితుడికి గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు బుధవారం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి.. ఘంటసాల మండలం శ్రీకాకుళంకు చెందిన గరికే సుబ్బరాజు అలియాస్ బ్లేడ్ స్థానిక సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 25న మరో కేసు విచారణలో భాగంగా పీటీ వారెంట్‌పై సుబ్బరాజును ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజు భీమవరం కోర్టుకు తీసుకువెళ్లారు. తిరిగి రాత్రి గన్నవరం తీసుకువచ్చి సబ్‌జైలులోకి పంపించే క్రమంలో ఆతనిని నెట్టివేసి సుబ్బరాజు పరారయ్యాడు. హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు సుబ్బరాజును అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు సుబ్బరాజుకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ 12వ ఏఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్ర సంఘానికి గుర్తింపు

విజయవాడస్పోర్ట్స్: పెనుమత్స సత్యనారాయణరాజు కార్యదర్శిగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను గుర్తిస్తూ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(హెచ్ఏఐ) బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్నేళ్లుగా రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌కు పోటీ సంఘాలు పుట్టుకొచ్చి క్రీడాకారులను అయోమయానికి గురి చేశాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ రాష్ట్రంలో ఒకే సంఘానికి హెచ్ఏఐ గుర్తింపు ఇచ్చింది. హెచ్ఏఐ గుర్తింపు ఆదేశాలతో రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఇదే సంఘాన్ని గుర్తించింది.

గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభం


పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి

తోట్లవల్లూరు: దేవరపల్లి డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. డ్రెయిన్ పొడవునా గుర్రపుడెక్క, తూటుకాడ అల్లుకుపోవటంతో మురుగు ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోయింది. మండలంలోని చాగంటిపాడు నుంచి పమిడిముక్కల మండలం ధూళిపూడిపాలెం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర డ్రెయిన్ విస్తరించి ఉంది. గత మూడు రోజుల నుంచి వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న విషయం విదితమే. దీంతో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాలతో డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపుతో సుమారు 500 ఎకరాలలో ముంపు తొలగటానికి వీలు కలగనుంది. పనులను జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, దేవరపల్లి సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు పరిశీలించారు.

‘జగనన్న సురక్ష’తో నూతన అధ్యాయం


ఆటపాక-2 సచివాలయంలో ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్


తోట్లవల్లూరులో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి

కైకలూరు: రాష్ట్రంలో జగనన్న సురక్ష కార్యక్రమం నూతన అధ్యాయానికి నాంది పలికిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. నియోజకవర్గంలో కైకలూరు మండలం ఆటపాక-2, ముదినేపల్లి మండలం సింగరాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులకు వివిధ రకాల ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. క్యాంపుల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను పేదల ఇంటికే తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ తలారి మణి, వైస్ ఎంపీపీలు మహ్మద్ జహీర్, రాచూరి రాధా, ముదినేపల్లి మండలం పార్టీ అధ్యక్షుడు మోట్రూ ఏసుబాబు, మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

తోట్లవల్లూరు: జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు కలగనుందని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అన్నారు. తోట్లవల్లూరు-2 సచివాలయానికి సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. అర్హులైన లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను రాజామణి, రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ పెనుమత్స రాధిక అందజేశారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం పాల్గొన్నారు.

7,221 సర్టిఫికెట్‌లు పంపిణీ..

మొవ్వ: ఈ నెల 1వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మొవ్వ మండలంలోని 16 సచివాలయాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 7,221 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లు అందించినట్లు తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. వీటిల్లో కూచిపూడి సచివాలయంలో అత్యధికంగా 1,071 లబ్ధిదారులకు అందించగా అతి తక్కువగా అవురుపూడి 114, అయ్యంకి 384, భట్లపెనుమర్రు 516, చినముత్తేవి 211, పెదముత్తేవి 593, కాజ-1లో 229, కాజ-2లో 357, కోసూరు 233, మొవ్వ-1లో 512, మొవ్వ-2లో 487, మంత్రిపాలెం 445, నిడుమోలు 830, పెదసనగల్లు 746, వేముడమడ 205, పెదపూడి 288 మందికి 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను అందించినట్లు వెల్లడించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న కైకలూరు విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్ చదివిన వారికి ప్రతి నెల రూ.10వేల నుంచి రూ.30వేలు పైబడి జీతం వచ్చే అవకాశం జాబ్‌మేళాలో సాధించవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తగిన ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. జాబ్‌మేళాలో 15 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. సుమారు 1200 మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందన్నారు. వివరాలకు ఉపాధి కార్యాలయ సిబ్బంది జి.వరప్రసాద్ 97013 57315, కె.శ్యామ్ 89785 24022లలో సంప్రదించాలని కోరారు.

ఓటర్ జాబితా పరిశీలన


పెదపారుపూడి ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు

పెదపారుపూడి: మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో ఇంటింటా ఓటర్ల జాబితాను పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు సంబంధించిన ఇంటింటా సర్వే చేస్తున్నామన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న ప్రకారం ప్రస్తుతం ఇక్కడ ఉంటున్నారా లేదా అడిగి తెలుసుకొని నమోదు చేసుకుంటున్నామన్నారు. ఓటర్లు చనిపోతే మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని ఓటు తొలగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి. నాగభూషణం, రెవెన్యూ ఆర్ఐ పి.రవికుమార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మొవ్వ పీహెచ్‌సీలో న్యాయ విజ్ఞాన సదస్సు

మొవ్వ: మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మొవ్వ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి. రాజస్ ఉదయ్ ప్రకాష్ న్యాయ విజ్ఞాన సదస్సుని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మొవ్వ పీహెచ్‌సీలో ఓపీ వివరాలను, చికిత్స వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి వైద్యాధికారి వేదరాజ్ ద్వారా వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి, సీహెచ్‌వో డి. శంకరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కూరేటి శ్రీ వెంకటేశ్వరరావు, న్యాయవాదులు కొల్లూరి రామాంజనేయులు, తాడిశెట్టి రాంబాబు, పోతుల శివ శ్రీనివాసు,కోర్టు కానిస్టేబుల్ కృష్ణ పాల్గొన్నారు.

29కి శాంతి ర్యాలీ వాయిదా

గుడివాడరూరల్: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను అరికట్టి శాంతిభద్రతలు కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 27వ తేదీన తలపెట్టిన శాంతి ర్యాలీని వాయిదా వేసినట్లు దళిత సంఘ నాయకులు పొంగులేటి జయరాజు, సుధాకర్‌లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27న పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించాలని అన్ని పార్టీల నాయకులు, దళిత నేతలతో కలసి తీర్మానించామన్నారు. కానీ వర్షాల కారణంగా దానిని 29వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు తెలిపారు.